ఓవర్‌లోడ్ సమస్యతో సతమతం

- విద్యుత్ వినియోగానికి తగిన సబ్‌స్టేషన్లు లేని వైనం
- మండలంలో అదనంగా విద్యుత్ సబ్‌స్టేషన్లు అవసరమంటున్న రైతులు
- సమస్య పరిష్కరించాలని విన్నపం


కథలాపూర్‌లో 33/ 11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్

కథలాపూర్: గృహాలకే కాకుండా పరిశ్రమలు, వ్యవసాయం కోసం విద్యుత్ వినియోగదారుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతుండటంతో విద్యుత్ సబ్‌స్టేషన్‌ల సంఖ్య పెరగకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్‌లతో సర్దడంతో ఓవర్‌లోడ్ సమస్యతో సతమతమవుతున్నామని వినియోగదారులు వాపోతున్నారు. వినియోగానికి తగ్గట్టు కథలాపూర్ మండలంలో అదనంగా విద్యుత్ సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేయాలని విద్యుత్ వినియోగదారులు కోరుతున్నారు.

19 గ్రామాలు.. 26,361 విద్యుత్ కనెక్షన్లు

కథలాపూర్ మండలంలో 19 గ్రామాలుండగా.. గృహాలు, వ్యవసాయ, వాణిజ్య విద్యుత్ కనెక్షన్లు 26,361 ఉన్నాయి. ట్రాన్స్‌కో అధికారులు మండలాన్ని శాఖపరంగా కథలాపూర్, అంబారిపేట సెక్షన్లుగా విభజించారు. కథలాపూర్ సెక్షన్ పరిధిలో కథలాపూర్, భూషణరావుపేట, బొమ్మెన, చింతకుంట గ్రామాల్లో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లున్నాయి. అంబారిపేట సెక్షన్ పరిధిలో అంబారిపేట, తాండ్ర్యాల, గంభీర్‌పూర్ గ్రామాల్లో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లున్నాయి. ఈ సబ్‌స్టేషన్ల నుంచి ఆయా గ్రామాలకు విద్యుత్ సరఫరా చేస్తున్నారు.

సబ్‌స్టేషన్లు అవసరమున్న గ్రామాలివే..

మండలంలోని సిరికొండ శివారు పరిధిలో గృహాలు, వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు 2,432 ఉన్నాయి. సిరికొండ గ్రామానికి కథలాపూర్ సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా చేస్తున్నారు. అప్పుడప్పుడు ఓవర్‌లోడ్‌తో త్రీఫేజ్ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందని రైతులు పేర్కొంటున్నారు. కొత్తగా 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేస్తేనే సమస్య పరిష్కారమవుతుందని స్థానికులు తెలిపారు. భూషణరావుపేట సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న పెగ్గెర్ల గ్రామంలో 1,000 విద్యుత్ కనెక్షన్లున్నాయి. ఇక్కడ కొత్త సబ్‌స్టేషన్ అవసరం. అంబారిపేట సబ్‌స్టేషన్ పరిధిలో ఇప్పపెల్లి, పోతారం గ్రామాల్లో విద్యుత్ సబ్‌స్టేషన్లు అవసరమని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం



విద్యుత్ ఓవర్‌లోడ్ సమస్యపై గ్రామాల్లో పర్యటించి తెలుసుకుంటాం. మండలంలో కొత్తగా విద్యుత్ సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేసే విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.
– రఘుపతి, ట్రాన్స్‌కో ఏడీఈ, కోరుట్ల

పంటలకు నీళ్లు అందడం లేదు



కథలాపూర్ సబ్‌స్టేషన్ నుంచి సిరికొండకు విద్యుత్ సరఫరా అవుతోంది. సిరికొండ శివారులో వ్యవసాయ విద్యుత్ మోటార్ల కనెక్షన్లు ఎక్కువగా ఉన్నాయి. ఓవర్‌లోడ్‌తో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడి పంటలకు సరిగా నీళ్లందడం లేదు. సిరికొండలో విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేస్తేనే విద్యుత్ సమస్య తీరుతుంది. ఏళ్లుగా సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని అధికారులను కోరుతున్నాం. చొరవ చూపాలి.
– కందరి కిషన్‌రెడ్డి, రైతు, సిరికొండ

కొత్త సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలి



అంబారిపేట సబ్‌స్టేషన్ నుంచి ఇప్పపెల్లి, పోతారం గ్రామాలకు విద్యుత్ సరఫరా అవుతుంది. ఈ రెండు గ్రామాల్లో వ్యవసాయ, గృహాల విద్యుత్ కనెక్షన్ల సంఖ్య ఎక్కువగా ఉంది. విద్యుత్ సమస్య ఉన్న రెండు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతోంది. పోతారం, ఇప్పపెల్లి గ్రామాలకు కలిపి కొత్తగా విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలి. అప్పుడే నాణ్యమైన విద్యుత్ అందుతుంది.
– గండ్ర విజయ్, రైతు, ఇప్పపెల్లి

క్లుప్తంగా

ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతాం


మాట్లాడుతున్న సత్యం

పెగడపల్లి: రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకే బీజేపీ ఆధ్వర్యంలో ప్రజాగోస–బీజేపీ భరోసా పేరిట గ్రామాల్లో కార్నర్ సమావేశాలు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా బీజేపీ అధికార ప్రతినిధి మద్రిపల్లి సత్యం అన్నారు. ఈ మేరకు మండలంలోని దోమలకుంట గ్రామంలో గురువారం బీజేపీ కార్నర్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ పాలనలో అవినీతి జరుగుతోందని, సంక్షేమ పథకాల పేరిట ప్రజలను అప్పుల పాలు చేశారని విమర్శించారు. సమావేశంలో రాష్ట్ర మహిళా మోర్చా కార్యవర్గ సభ్యురాలు అనసూయ, మండల అధ్యక్షుడు కొమురెల్లి, నాయకులు మహేశ్, గంగయ్య, రమేశ్, విష్ణు, తిరుపతి, మోహన్‌రెడ్డి, నరేందర్, కిషోర్, రమేశ్, తిరుపతి, మహేందర్, గంగాధర్, బాబు తదితరులు పాల్గొన్నారు.

భూపతిపూర్‌లో యాగశాల ప్రవేశం


పూజల్లో పాల్గొన్న భక్తులు

రాయికల్: మండలంలోని భూపతిపూర్‌లో లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం అర్చకులు గిరిధరాచార్యులు, వెంకటకృష్ణ, రమణ, రామకృష్ణాచార్యుల ఆధ్వర్యంలో యాగశాల ప్రవేశం, గరుడ ప్రసాదం వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ చంద్రశేఖర్, వైస్ ఎంపీపీ మహేశ్వర్‌రావు, ఉపసర్పంచ్ అన్నవేని వేణు, సింగిల్‌విండో చైర్మన్ ఏనుగు ముత్యంరెడ్డి, అలయ కమిటీ చైర్మన్ సంకోజి మహేశ్ పాల్గొన్నారు.

బద్ది పోచమ్మకు బోనాలు


బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

కోరుట్లరూరల్: మండలంలోని యూసుఫ్‌నగర్ గ్రామంలో గురువారం బద్ది పోచమ్మ జాతర ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు బోనాలను ఊరేగింపుగా తీసుకవెళ్లి అమ్మవారికి సమర్పించారు. ఈ సందర్భంగా పోతురాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. సర్పంచ్ గుగ్గిళ్ల తుక్కారాంగౌడ్, ఎంపీటీసీ గుగ్గిళ్ల ప్రియాంక, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ గుగ్గిళ్ల సురేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

రాష్ట్ర పథకాల్లో కేంద్ర భాగస్వామ్యం


మాట్లాడుతున్న నాయకులు

కోరుట్ల: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల్లో కేంద్ర ప్రభుత్వ భాగస్వామ్యం ఉంటుందని బీజేపీ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి డా.జేఎన్ వెంకట్ అన్నారు. ఈ మేరకు పట్టణంలో గురువారం ప్రజాగోస బీజేపీ భరోసా స్ట్రీట్ కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు కోరుట్ల, మెట్‌పల్లి పట్టణాలకు రూ.50కోట్ల చొప్పున కేటాయించి అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చి రూ.20కోట్లు కూడా ఖర్చు చేయకుండా అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. కార్యక్రమంలో కోరుట్ల అసెంబ్లీ కన్వీనర్ సుఖేందర్, నాయకులు సుదవేణి మహేశ్, మురళి, నవీన్ కుమార్ పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ సందర్శన


గ్రామపంచాయతీలో విద్యార్థులు

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేట గ్రామపంచాయతీ కార్యాలయాన్ని జెడ్పీ హైస్కూల్‌కు చెందిన ఆరో తరగతి విద్యార్థులు గురువారం సందర్శించారు. గ్రామపంచాయతీ, పాలకవర్గం విధులు అనే పాఠంపై విద్యార్థులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. సర్పంచ్ కూన సులోచన, హెచ్‌ఎం ఆనంద్, కార్యదర్శి ఎం.డీ గఫూర్, టీచర్ నరేశ్ పాల్గొన్నారు.

దళితబంధు దేశానికే ఆదర్శం


దళితబంధు యూనిట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజయ్, జెడ్పీచైర్‌పర్సన్ వసంత

జగిత్యాలరూరల్: దళితబంధు దేశానికే ఆదర్శమని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. ఈ మేరకు గురువారం జగిత్యాల రూరల్ మండలం పొరండ్ల గ్రామానికి చెందిన నక్క హరీశ్‌కు దళితబంధు పథకం కింద మంజూరైన మల్లికార్జున డెకోరేషన్, డీజే షాపును వారు ప్రారంభించారు. ఎంపీటీసీ ఆరె సౌజన్య, నాయకులు గంగారెడ్డి, ముకుందం, రవి, కరుణాకర్, జగన్, తిరుపతి, మహేశ్, శేఖర్, రాజేశ్, మధు పాల్గొన్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం

జగిత్యాల: ఆరోగ్యమే మహాభాగ్యమని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు గురువారం జిల్లా కేంద్రంలో మినీస్టేడియంలో రూ.12లక్షలతో మహిళలకు ఓపెన్ జిమ్, రూ.8లక్షలతో మరుగుదొడ్లు, రూ.6లక్షలతో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లు, వివిధ వార్డుల్లో ఏర్పాటు చేసిన అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. నియోజకవర్గాల్లో క్రీడా ప్రాంగణాలు, వాకింగ్ ట్రాక్‌లు, ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, చుక్క నవీన్, అనిల్, లత, మల్లికార్జున్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన రాయికల్ తహసీల్దార్

రాయికల్: రాయికల్ తహసీల్దార్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఖయ్యూం గురువారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందించారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దార్ అనిల్ ఉన్నారు.

షీ టీమ్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు


అవగాహన కల్పిస్తున్న పోలీసులు

కొడిమ్యాల: మండల కేంద్రంలోని ప్రభుత్వ మోడల్ స్కూల్, జూనియర్ కళాశాల విద్యార్థులకు జగిత్యాల జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో షీ టీమ్స్ బృందం ఆధ్వర్యంలో పలు అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. మనుషుల అక్రమ రవాణా ఎలా, దాని నిరోధానికి తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ లావణ్య, కొడిమ్యాల ఎస్సై వెంకట్రావు, ఎస్‌ఎంసీ చైర్మన్ ఎర్రోజు శ్రీనివాస్‌చారి, ఏఎస్సై వలి, కానిస్టేబుల్ సౌజన్య, సంతోష్ పాల్గొన్నారు.

మూఢ నమ్మకాల నిర్మూలనపై అవగాహన

పెగడపల్లి: మండలంలోని నందగిరి గ్రామంలోని తెనుగువాడ ప్రాథమిక పాఠశాలలో అంతర్జాతీయ మ్యాజిక్ దినోత్సం పురస్కరించి విద్యార్థులకు మూఢ నమ్మకాల నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా భారత నాస్తిక సమాజం రాష్ట్ర కార్యదర్శి ఉప్పులేటి నరేశ్‌ను సన్మానించారు. వైస్ ఎంపీపీ గాజుల గంగాధర్, సర్పంచ్ రాకేశ్, హెచ్‌ఎం వెంకటేశం, ఉప సర్పంచ్ అశోక్ రెడ్డి, నాయకులు రవి, చారి, లచ్చయ్య, శంకర్, మహిపాల్, వీరమల్లు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

✦ నేడు మున్సిపల్ బడ్జెట్ సమావేశం

రాయికల్: పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మున్సిపల్ సాధారణ బడ్జెట్ సమావేశం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ సంతోష్‌కుమార్ గురువారం తెలిపారు.

✦ పోలీస్‌స్టేషన్ తనిఖీ

రాయికల్: పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌ను గురువారం నూతనంగా బాధ్యతలు స్వీకరించిన జగిత్యాల రూరల్ సీఐ ఆరిఫ్ అలీఖాన్ తనిఖీ చేశారు. రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ముస్లిం యూత్ వెల్ఫేర్, కోఆప్షన్ మెంబర్ మొఖీద్‌తో పాటు నాయకులు రశీద్, అన్సర్, ముజాహిద్, ఫక్రోద్దీన్, ఎజాజ్, సబీబ్ సీఐని కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

✦ కథలాపూర్ పోలీస్‌స్టేషన్..

కథలాపూర్: కథలాపూర్ పోలీస్‌స్టేషన్‌ను జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్‌కు చెందిన ఆర్‌ఎస్సై వినోద్‌రెడ్డి గురువారం తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్‌లోని అన్ని గదులను పరిశీలించి వస్తువులు, రికార్డుల వివరాలను నమోదు చేసుకున్నారు. పోలీస్‌స్టేషన్ ఆవరణను పరిశీలించి సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఏఎస్సై ఆలీమోద్దిన్ ఉన్నారు.

✦ నట్టల నివారణ మందులు పంపిణీ

జగిత్యాలఅగ్రికల్చర్: జగిత్యాల రూరల్ మండలంలోని కల్లెడ గ్రామంలో గురువారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. సర్పంచ్ మహేశ్వర్‌రావు, ఎంపీటీసీ పరశురాంగౌడ్, సింగిల్‌విండో అధ్యక్షుడు సందీప్‌రావు, పశువైద్యాధికారి హిమజ పాల్గొన్నారు.

✦ ఒబులాపూర్‌లో కంటివెలుగు ప్రారంభం

మల్లాపూర్: మండలంలోని ఒబులాపూర్‌లో కంటివెలుగు పథకాన్ని సర్పంచ్ అలిశెట్టి రవితో కలిసి మండల వైద్యాధికారి డాక్టర్ వాహిని ప్రారంభించారు. ఉపసర్పంచ్ ఎర్ర నర్సు, కంటివెలుగు ప్రత్యేక వైద్యాధికారులు డాక్టర్ నాగార్జున, డాక్టర్ రాహుల్ శర్మ, హెల్త్ సూపర్‌వైజర్లు ఇందిర, శ్రీనివాస్, నాయకులు ఎర్ర రమేశ్ పాల్గొన్నారు.

✦ వెంకటాపూర్‌లో పశువైద్య శిబిరం

కోరుట్లరూరల్: మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో కోరుట్ల పశువైద్య కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో గురువారం పశువైద్య శిబిరం నిర్వహించారు. జాతీయ సేవా పథకం ప్రోగ్రాం ఆఫీసర్ కృష్ణప్రసాద్, ఎంపీపీ తోట నారాయణ, పశువైద్యాధికారి డా.ధీరజ్, మండల వ్యవసాయ అధికారి నాగమణి, శాస్త్రవేత్తలు డా.సంతోషిణి, డా.విశాల్, డా.సురేశ్, మాజీ సర్పంచ్ లింగారెడ్డి పాల్గొన్నారు.

✦ నేటి నుంచి శ్రీరేణుకా ఎల్లమ్మ జాతర ఉత్సవాలు

సారంగాపూర్: మండలంలోని రేచపల్లి గ్రామ శివారుల్లోని శ్రీరేణుకా ఎల్లమ్మ జాతర ఉత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నట్లు గౌడ సంఘం అధ్యక్షుడు జోగినపల్లి శ్రీనివాస్‌గౌడ్, ఉపాధ్యక్షుడు మోత్కూరి సత్యనారయణగౌడ్ తెలిపారు. రేచపల్లిలో గౌడ సంఘం కమ్యూనిటీ భవన నిర్మాణానికి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి రూ.3లక్షలు మంజూరుకు హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. కాగా జాతర ఉత్సవాలకు ఎమ్మెల్సీ రూ.10వేలు అందించారని పేర్కొన్నారు.

రైతులకు కావాల్సిన సేవలు అందించాలి


మంత్రికి కృతజ్ఞతలు తెలుపుతున్న పాలకవర్గం

పెగడపల్లి: ఏఎంసీ ద్వారా రైతులకు కావాల్సిన సేవలు అందించి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని మంత్రి కొప్పుల ఈశ్వర్ సూచించారు. ఈ మేరకు నూతనంగా నియామకమైన పెగడపల్లి వ్యవసాయ మార్కెట్ పాలకవర్గం సభ్యులు మంత్రి ఈశ్వర్‌ను కరీంనగర్‌లోని క్యాంపు కార్యాలయంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు ఏఎంసీ చైర్మన్ లోక నిర్మల, వైస్ చైర్మన్ ఆంజనేయులు (అంజి), డైరెక్టర్లు మంత్రిని కలిసి పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు. పెగడపల్లి విండో చైర్మన్ రమణారావు, పెగడపల్లి సర్పంచ్ శ్రీనివాస్, టీఆర్‌ఎస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి మల్లారెడ్డి, వెంకన్న పాల్గొన్నారు.

వంజరులను ఎస్టీ జాబితాలో చేర్చాలి


వినతిపత్రం ఇస్తున్న వంజరి సంఘం సభ్యులు

జగిత్యాలటౌన్: సంచారజాతికి చెందిన తమను ఎస్టీ జాబితాలో చేర్చాలని జగిత్యాల వంజరి సంఘం నాయకులు కొండెరి రాము కోరారు. ఈ మేరకు గురువారం కలెక్టర్ యాష్మిన్‌బాషాకు వినతిపత్రం సమర్పించారు. మహేశ్, శంకర్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ఆయిల్‌పామ్‌తో రైతుల ఆర్థికాభివృద్ధి

జగిత్యాలఅగ్రికల్చర్: ఆయిల్‌పామ్‌తో రైతులు ఆర్థికాభివృద్ధి సాధిస్తారని జగిత్యాల అర్బన్ మండల వ్యవసాధికారి వినీల పేర్కొన్నారు. ఈ మేరకు జగిత్యాల అర్బన్ మండలంలోని మోతె గ్రామంలో సర్పంచ్ సురకంటి స్వప్న తోటలో ఆయిల్‌పామ్ మొక్కలు నాటే కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ఆయిల్‌పామ్ నాటే రైతులకు సబ్సిడీపై డ్రిప్ పరికరాలు, మొక్కలు ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో నాగరాజు, హెచ్‌ఈవో అన్వేష్, రైతులు బద్దం రాజేందర్‌రెడ్డి, సతీశ్ పాల్గొన్నారు.

పోస్టాఫీస్ బీమాతో కుటుంబానికి భద్రత


చెక్కు అందజేస్తున్న పోస్టుమాస్టర్ చాంద్

మల్యాల: పోస్టాఫీసు బీమా చేసుకుంటే కుటుంబానికి భద్రత ఉంటుందని ముత్యంపేట పోస్టాఫీసు బ్రాంచ్ మాస్టర్ చాంద్ అన్నారు. ఈ మేరకు మండలంలోని ముత్యంపేట గ్రామానికి చెందిన చిలువేరి మాధవికి గురువారం బ్రాంచ్ పోస్టుమాస్టర్ చాంద్ రూ.3లక్షల విలువైన బీమా చెక్కు అందజేశారు. పోస్టాఫీసులో రూరల్ పోస్టల్ ఇన్సూరెన్స్ ద్వారా చిలువేరి శ్రీకాంత్ పేరిట మూడు నెలలకు ఒకసారి రూ.3144 చొప్పున చెల్లించారన్నారు. ఇటీవల శ్రీకాంత్ గుండెపోటుతో మృతిచెందగా, రూ.3లక్షల బీమా వర్తించిందని, ఈ మేరకు చెక్కును మృతుడి భార్య మాధవికి చెక్కు అందజేసినట్లు పేర్కొన్నారు.

నాణ్యమైన వైద్యంతోనే గుర్తింపు


ఆస్పత్రిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు

కోరుట్ల: ప్రైవేట్ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్యం అందిస్తేనే సరైన గుర్తింపు వస్తుందని ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. ఈ మేరకు గురువారం పట్టణంలోని ఎల్‌ఐసీ కాలనీలో సురక్షా ఆసుపత్రిని ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అన్నం లావణ్య, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు అన్నం అనిల్, డా.సచిన్, ఆసుపత్రి నిర్వాహకులు పాల్గొన్నారు.

వరదరాజన్ కుటుంబాన్ని అన్నివిధాలా ఆదుకుంటాం

మేడిపెల్లి: సీనియర్ జర్నలిస్ట్ వరదరాజన్ అంత్యక్రియలు మండల కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావుతో పాటు పలువురు ప్రముఖులు వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ మేరకు తక్షణ సాయంగా రూ.15వేలు అందజేశారు. అలాగే కోరుట్లలో డబుల్‌బెడ్రూం ఇప్పటికే మంజూరు చేశామని తెలిపారు. వరదరాజన్ కుటుంబాన్ని అన్నివిధాలా ఆదుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

కేంద్ర పథకాలను ఇంటింటికీ తీసుకెళ్లాలి


మాట్లాడుతున్న ప్రభాకర్

రాయికల్: కేంద్ర పథకాలను ఇంటింటికీ తీసుకెళ్లాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సాంబారి ప్రభాకర్ కోరారు. ఈ మేరకు గురువారం పట్టణంలో ప్రజాగోస–బీజేపీ భరోసా కార్నర్ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తూ దేశ ప్రధాని నరేంద్రమోడీ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన కల్పించాలన్నారు. కార్యకర్తలంతా ఐకమత్యంగా ఉంటూ పార్టీ పటిష్టతకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. పట్టణ అధ్యక్షుడు కల్లెడ ధర్మపురి, నాయకులు కూనారపు భూమేశ్, లక్ష్మీకాంతం, రెడ్డి, శేఖర్, మల్లేశ్, నారాయణరెడ్డి, నరేందర్ పాల్గొన్నారు.

వ్యవసాయ రుణమాఫీ వడ్డీతో చెల్లించాలి

మల్లాపూర్: సీఎం కేసీఆర్, బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎన్నికల హామీ వ్యవసాయ రుణమాఫీ రూ.1లక్షను వడ్డీతో సహా వెంటనే చెల్లించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు సాంబారి ప్రభాకర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రజాగోస–బీజేపీ భరోసా కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. ప్రజలు, రైతులు, యువత పక్షాన బీజేపీ చేస్తున్న పోరాటాలకు మద్దతు ఇవ్వాలని కోరారు. బీజేపీ రాష్ట్ర నాయకురాలు జంగిలి సునీత, జిల్లా ప్రధాన కార్యదర్శి ఇల్లెందుల శ్రీనివాస్, మండల అధ్యక్షుడు ముద్దం సత్యనారాయణగౌడ్, శక్తి కేంద్రం ఇన్‌చార్జి పుప్పాల మహేశ్, సహా ఇన్‌చార్జి గుండ నరేందర్, బూత్ అధ్యక్షులు కైర నరేశ్, సారుగు దేవన్న, డా.స్వామి, జిల్లా కార్యదర్శి ఎర్ర లక్ష్మి, మహిళా మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలు అంజమ్మ, పట్టణ అధ్యక్షుడు లవంగ శివకుమార్, నాయకులు ముత్యాల రాకేశ్, ఎర్రరాజు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం


శంకుస్థాపన చేస్తున్న జెడ్పీటీసీ, ఎంపీపీ

మల్లాపూర్: ప్రజా సంక్షేమమే బీఆర్‌ఎస్ ప్రభుత్వ ధ్యేయమని ఎంపీపీ కాటిపెల్లి సరోజన, జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఈ మేరకు గురువారం మండలంలోని సిరిపూర్, కుస్తాపూర్, రత్నాపూర్, చిట్టాపూర్, గుండంపల్లి, సాతారం, రేగుంట, గొర్రెపల్లి, వేంపల్లి, వెంకట్రావ్‌పేట గ్రామాల్లో రూ.5.21 కోట్లతో నిర్మించనున్న సీసీరోడ్లు, గ్రామ పంచాయతీ భవనాలు, మెటల్ రోడ్ల నిర్మాణాలకు వారు శంకుస్థాపన చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామాలు సంపూర్ణంగా అభివృద్ధి చెందితేనే రాష్ట్రం, దేశం ప్రగతి పథంలో నిలుస్తుందన్న నమ్మకంతోనే సీఎం కేసీఆర్ రూ.వేల కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారన్నారు. వైస్ ఎంపీపీ గౌరు నాగేశ్, రైతుబంధు కమిటీ మండల అధ్యక్షుడు కొమ్ముల జీవన్‌రెడ్డి, సర్పంచ్‌లు భూక్య గోవింద్‌నాయక్, కుందేల్ల నర్సయ్య, కడకుంట్ల సాయికుమార్, బొడ్డు సుమలత, బిట్ల సరోజన, ధనరేకుల మల్లు, జోగుల మమత, కొంపెల్లి సరోజన, ఎంపీటీసీలు ఏనుగు రాంరెడ్డి, మైస లక్ష్మి, తోట సుజాత, గుగ్లావత్ భూమి, సింగిల్‌విండో చైర్మన్లు నేరేళ్ల మోహన్‌రెడ్డి, బద్దం అంజిరెడ్డి, నాయకులు కాటిపెల్లి ఆదిరెడ్డి, బద్దం నర్సారెడ్డి, ధనరేకుల సంతోష్‌యాదవ్, బిట్ల నరేశ్, బొడ్డు రాజేశ్, జోగుల రాజేశ్, గుగ్లావత్ భూమి, తోట శ్రీనివాస్, కదర్కు నర్సయ్య, నూతుల లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలు ఎండగట్టాలి


పరామర్శిస్తున్న జువ్వాడి కృష్ణారావు

మల్లాపూర్: బీజేపీ, బీఆర్‌ఎస్ ప్రభుత్వాల వైఖరితోనే రాష్ట్రంలో ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, రైతులు, నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ధర్మపురి ఆలయ కమిటీ మాజీ చైర్మన్ జువ్వాడి కృష్ణారావు ఆరోపించారు. ఈ మేరకు గురువారం మండలంలోని చిట్టాపూర్‌లో బాధిత కుటుంబాలను ఆయన పరామర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్రతో దేశవ్యాప్తంగా కాంగ్రెస్ ప్రభంజనం కనిపిస్తోందని, కేంద్రంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. సీడీసీ మాజీ చైర్మన్ కంది బుచ్చిరెడ్డి, కిసాన్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంచిరాల చిన్నారెడ్డి, నాయకులు కొత్తపల్లి రాజరెడ్డి, బోడ శేఖర్, ఆరేళ్ల నర్సయ్య, తిరుమల గంగాధర్ పాల్గొన్నారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న కళాశాల యాజమాన్యం

జగిత్యాల: మార్చి 1న ఆర్‌కే, ఎన్‌ఎస్వీ విద్యాసంస్థల ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించనున్నామని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని విద్యాసంస్థల అధినేత రామకృష్ణ కోరారు. ఈ మేరకు జాబ్ మేళాకు సంబంధించిన పోస్టర్‌ను కళాశాలలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ జాబ్‌మేళాలో 35కు పైగా వివిధ రంగాల్లో ప్రాముఖ్యం గల కంపెనీలు పాల్గొంటాయని, పేర్కొన్నారు. డిగ్రీ ఫైనల్ ఇయర్, బీటెక్ చేస్తున్న విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. సమావేశంలో అధ్యాపక బృందం రాజేందర్, రాజేశ్, శ్రీనివాస్‌రెడ్డి, మునీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని పోచమ్మవాడలో మున్నూరుకాపు యువజన సంఘం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 150 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 40 మంది శస్త్ర చికిత్సల నిమిత్తం రేకుర్తి లయన్స్‌క్లబ్‌కు పంపించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ జిల్లా అధ్యక్షుడు తాటిపాముల సురేశ్, గుండేటి గంగాధర్, ఒడ్నాల రాజశేఖర్, తాటిపాముల వినోద్, శ్రీనివాస్, శ్రీరాముల సుదర్శన్, రాజన్న, శంకర్ పాల్గొన్నారు.

బృహత్ పల్లె ప్రకృతివనం స్థల పరిశీలన

ఇబ్రహీంపట్నం: మండలంలోని ఎర్దండి గ్రామంలో బృహత్ పల్లె ప్రకృతివనాన్ని పెంచేందుకు స్థలాన్ని గురువారం ఎంపీడీవో ప్రభు పరిశీలించారు. గ్రామ శివారులో ప్రభుత్వ భూమి 3 ఎకరాలను రెవెన్యూ అధికారులు కేటాయించడంతో పరిశీలించి వివిధ రకాల మొక్కలను పెంచేందుకు అనువుగా ఉన్నదా లేదా అని పరిశీలించారు. టెక్నికల్ అసిస్టెంట్ స్రవంతి, పంచాయతీ కార్యదర్శి మనోజ్, కారోబార్ రత్నం, నాయకులు గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.